# నిజ శోభనం

రోజుకొక వింతగా వుంటోంది రంగారావు ప్రవర్తన!

మొగుడిలో వస్తున్న మార్పును అత్యంత ఆసక్తిగా గమనిస్తోంది శాంభవి.

రెండు నెలల క్రితం— ముందుగా మాట వరసకైనా తనతో సంప్రదించకుండా వేరే యిల్లు చూసి అడ్వాన్సు యిచ్చేశాడు. "ఎల్లుండి ఆదివారం మనం యిల్లు మారుస్తున్నాం" అని అతను చెప్పినప్పుడు తను చాలా షాకయింది. కాసేపు మాట కూడా రాలేదు.

తమ వివాహమై మూడేళ్లు కావస్తోంది. తను కాపురానికి వచ్చింది ఆ పోర్షన్‌లోకే. వరండా, పడక గది, కిచెన్— సెపరేట్ బాత్ రూం, లెట్రిన్— వెనుక వైపు బావి, మునిసిపల్ పంపూ వున్నాయి. దేనికీ అక్కడ అసౌకర్యమనేది లేదు. ఆ మాట కూడా, ఎప్పుడూ అనుకోలేదు.

అటువంటప్పుడు, ఆ పోర్షన్ ఖాళీ చేసి మరో క్రొత్త లోకాలిటీకి వెళ్లాలన్న ఆలోచన అతనికెందుకొచ్చిందో అంతుపట్టలేదు తనకి.


మనసుండబట్టక, ఆ వివరం అడిగినప్పుడు —"అది నా ఆఫీసుకి కాస్త దగ్గర. మొన్న సాయంత్రం మా ఫ్రెండు వాళ్ల యింటికి వెడుతూ దారిలో 'టూలెట్' బోర్డు చూసి యధాలాపంగా ఆ పోర్షన్ చూడ్డం జరిగింది. క్రొత్త యిల్లు. బాగానే వుంది. యిక్కడున్న సదుపాయాలన్నీ అక్కడా వున్నాయ్. కాగా, ఒక గది ఎక్కువగా వుంది. అద్దె ఓ యాభై ఎక్కువ. అయినా పరవాలేదు. మాస్తావ్ కదా!" అన్నాడు. తానింకేమీ అనలేక పోయింది.

ఆ మరునాడు— ఆఫీసు నుంచి వస్తూ ఒక మంచం కొనుక్కొని వచ్చాడు. అదెందుకని అడిగింది తను. "అక్కడ ఒక గది ఎక్కువని చెప్పాను కదా? అది ఖాళీగా వుంచకుండా, అందులో వేద్దాం— బావుంటుంది" అన్నాడు.

అది మంచిదనే అనిపించింది తనకి. ఎవరైనా బంధువులు వచ్చినప్పుడు, ముందు వరండాలోని సోఫా—కం—బెడ్‌ని వాళ్ల పడకకి ఉపయోగించాల్సి వస్తోంది. యిక మీదట ఎవరు వచ్చినా ఆ గదిలో ఆ మంచం మీద పడుకోవచ్చు కదా అని ఆలోచించింది.

తీరా యిల్లు మారిన తరువాత, అతనా మంచాన్ని అంత అర్జంటుగా ఎందుకు కొన్నాడో అర్ధమైంది.

అక్కడ యింటి వరండాలోని ఫర్నిచరంతా యిక్కడ కూడా యధాతథంగా ముందు వరండాలో సర్దాడు. అక్కడి పడక గదిలోని ఫర్నిచర్ వగయిరా మాత్రం ఇక్కడి రెండు గదుల్లో ఒక పద్ధతి ప్రకారం విడదీశాడు. అలా



ఎందుకు చేశాడన్నది ఆ రాత్రికి కాని అర్థం కాలేదు తనికి!

మొదటి బెడ్ రూం తనకి కేటాయించి, రెండవ రూంలో తన పడకకి ఏర్పాట్లు చేసుకున్నాడు. టీవీ కూడా అందులోనే పెట్టుకున్నాడు.

"మీరూ యిక్కడే పడుకోవచ్చు కదా?" అనడిగింది తను. అతను నవ్వేడు. "ఎవరైనా గెస్టులు వచ్చినప్పుడు అది ఎలాగూ తప్పదనుకుంటాన్లే!" అనేశాడు నవ్వుతూనే.

తానింకేమీ అనలేదు. ఎందుకనో ఆ ఏర్పాటు తనకి చాలా నచ్చింది. లోపల్లోపల కాస్తంత సంతోషించింది కూడా!

తన మనసు తెలుసుకుని తదనుగుణంగా సర్దుకుపోయే భర్త దొరికినప్పుడు, ఏ భార్య అయినా సంబరపడి పోవడం సహజం! అదే శాంభవి విషయంలోనూ జరిగింది.

అయితే— ఆ దరిమిలా జరిగిన సంఘటనలు మాత్రం ఆమెకి కలవరం కలిగిస్తున్నాయ్!

ఆ యింట్లోకి ప్రవేశించిన మరుపటి వారం నుంచీ అతను తన బట్టల్ని లాండ్రీకి వేసుకొంటున్నాడు. లుంగీ, టవల్, బనియన్ వగయిరాల్ని ఉదయం స్నానానికి వెళ్లినటయిములో తనేఉతుక్కుని ఆరేసుకొంటున్నాడు.

తను కాపురానికి వచ్చినప్పటి నుంచీ అతని బట్టలన్ని ఉతికి ఆరేయడం, తనే వాటిని యిస్త్రీ చేసి బీరువాలో సర్దడం చేస్తోంది. మరి, షడన్‌గా ఈ కొత్త పద్ధతి ఎందుకు మొదలెట్టినట్లూ?

"నేను సరిగా ఉతకడం లేదని, మీ బట్టలు లాండ్రీకి వేస్తున్నారా?" అని అడిగింది. నవ్వుతూ తల అడ్డంగా ఊపేడు. "అనవసరంగా నిన్ను కష్ట పెట్టడం నా కిష్టం లేదు.." అని వూరుకున్నాడు.

ఆ సమాధానం తన మనసుకి చిన్న బాధ కలిగించింది. "మీ బట్టలు ఉతకడం నాకు కష్టమని మీరెందు కనుకొంటున్నారూ?" అని వివరమడిగింది..

మళ్లీ నవ్వేడతను. "యిదేమంత సీరియస్ గా తీసుకోవలసిన విషయమేం కాదు. యిప్పు డొస్తున్న వాషింగ్ పౌడర్లూ, సబ్బులూ బట్ట ల్ని తెలుపు చేస్తున్నా, చేతులకి హాని కలిగి స్తున్నాయని అందరూ అంటున్నమాట! నీ చేతులు ఎప్పుడూ అందంగా సుకుమారంగా



వుండాలని నేను కోరుకోడం తప్పేం కాదు. ఆఫ్టరాల్—అయ్యాం యువర్ హస్బెండ్!" అన్నాడు ప్రేమగా చూస్తూ.

తానింకేమీ మాట్లాడ లేక పోయింది.

అడిగిన దానికి మటుకే సమాధానం చెప్ప డం అతను సరి కొత్తగా చేసుకున్న మరో అల వాటు ఆ సమాధానం కూడా అతి క్లుప్తంగా వుంటోంది. అలాగని, తుంచి పారేసినట్టుగా మాట్లాడ్డం లేదు. ప్రేమాభిమానాలకి కొదువ లేదన్నట్టే వుంటోంది ఆ ధోరణి...

యిది వరకు తనే ఎక్కువగా మాట్లాడే వాడు. కిచెన్‌లో వంట చేసుకొంటున్నప్పుడు కూడా ప్రక్కనే నిలబడి ఏవో కబుర్లు చెబు తుండేవాడు. సినిమాల గురించీ, టీవీ ప్రోగ్రాముల గురించీ, రాజకీయాల గురించీ, ఎక్కడెక్కడో జరిగిన వింతల గురించీ— తెగ చెబుతుండేవాడు! యిప్పుడసలు తన పక్కన మాట్లాడడమే లేదు. తన గదిలో ఏదో పుస్తకం చదువుకొంటూనో, టీవీ చూస్తూనో వుండి పోతున్నాడు.

వారానికొకసారి, తప్పకుండా సినిమాకి తీసుకువెడుతుండేవాడు. యిప్పుడా అలవాటు కూడా తప్పించేసుకున్నాడు. "యిప్పుడు నీకి క్కడి యిరుగూ పొరుగూ పరిచయమయ్యా రు కదా! నీకు వెళ్లాలనిపించినప్పుడు, వాళ్లెవరి తోనైనా నీ కిష్టమైన సినిమాకి వెళ్లు. ముందు గా నాతో చెప్పాలని కూడా మాడఖ్ఖర్లేదు" అని చెప్పేశాడొక రోజు.

'ఏం? మునుపటిలాగా మీరే తీసుకెళ్ల వచ్చు కదా?' అని అడిగితే ఏం సమాధానం చెప్పేవాడో మరి! కాని, తను అడగలేక పోయింది. అతనా మాట చెప్పగానే 'అలాగే' అన్నట్టు తలూపేసింది.

తనని అలక్ష్యం చేస్తున్నాడని గానీ, నిర్ల క్ష్యంగా చూస్తున్నాడనుకోవడానికి గానీ ఎక్క డా ఆస్కారం కనిపించడం లేదు. తనకి ఏ విషయంలోనూ లోటు జరగడం లేదు. యిం ట్లోకేమీ తక్కువ చేయడం లేదు.

అతనికి జీతమెంత వస్తుందో యిదమిద్దం గా తనకి తెలియదు. కాని— 'గీతం' మాత్రం బాగానే వస్తుంది. అతను పని చేస్తున్న డిపా ర్టుమెంటు అటువంటిది మరి! ఈ యింట్లో కి మారక ముందు జీతం,గీతం కూడా తన చేతికిచ్చేవాడు. అతనికి అవుసరమొచ్చినంతా అడిగి పుచ్చుకునే వాడు.

యిప్పుడలా యివ్వటం లేదు. జీతం అం దుకున్న మరునాడు "నీకేమన్నా డబ్బు కావా లా?" అనడిగాడు. ఆ ప్రశ్న తనకి విస్మయా న్ని కలిగించింది. అవుసరం లేదన్నట్టు తల అడ్డంగా ఊపింది. "ఏమయినా ఖర్చులకి పని కొస్తుంది— యిది వుంచు" అని ఐదు వం ద నోట్లు లెక్క పెట్టి యివ్వబోయాడు.

"వద్దు.. యింతకు ముందు మీరిచ్చిన బాపతు డబ్బు బీరువాలో వుంది గదా!" అంది తను. ఆ మొత్తం నాలుగు వేలకి పయి గానే వుంటుంది. కావలసింది అడిగి తీసుకో వడం వరకే గాని, తానెంత యిచ్చిందీ ఎంత పుచ్చుకున్నదీ, యితర్త్రా ఏం ఖర్చు పెట్టిం దీ— ఎప్పుడూ లెక్క అడగలేదు.

సిగరెట్ కాల్చడం తప్ప అతనికి మరింకే వ్యసనం లేదు. అనవసరమైన దుబారా ఖర్చు చేయడు. ఆఫీసు నుంచి సాయంత్రం ఆరు గంటలకల్లా వచ్చేస్తుండేవాడు. శలవు రోజున కూడా సామాన్యంగా ఎక్కడికీ వెళ్లేవాడు కాదు...

యిటీవల, ఆస్థితి కొంచెం మారింది. సాయంత్రం ఏడున్నర దాటిన తరువాత కాని యిల్లు చేరడం లేదు. శలవు రోజుల్లో యింటి పట్టున వుండడం లేదు. 'అలా బయటికె ళ్లొస్తాను' అని ఓ మాట చెప్పి వెళ్లి పోతు న్నాడు. అది ఎక్కడికన్నది తెలియడం లేదు.

ఒక్కొక్కప్పుడు— "నేను రావడం ఆల స్యం కావచ్చు! నువ్వు భోజనం చేసెయ్— నా

నాచర్ల సూర్యనారాయణ

"కోసం మాడొద్దు" అని చెప్పడం కూడా జరుగుతోంది. యిది వరకు అటువంటి ప్రస్తావనే వుండేది కాదు.

ఫలానా కూర వెయ్యమనీ, ఫలానా పిండి వంట వేయమనీ అడిగీ, బతిమలాడీ తన చేత వేయించుకుని తినేవాడు. యిప్పుడా ఊసే లేదు. కేరేజీలో ఏది పెడితే అది పట్టుకెళుతున్నాడు. ఏదయినా స్వీటుకానీ, కారా కానీ తినాలనిపించినప్పుడు బయట నుంచి కొని తెచ్చేస్తున్నాడు.

ఎందుకిలా చేస్తున్నాడూ?

అంచెలంచెలుగా అతనిలో వస్తున్న ఈ మార్పుకి కారణమేమిటి?

ఎంత ఆలోచించినా సమాధానం దొరకడం లేదు శాంభవికి.


ప్రతి శుక్రవారం అన్ని గదులూ కడిగి ముగ్గు పెట్టడం అలవాటు తనకి. ఆ పని, ఉదయం రంగారావు ఆఫీసుకి వెళ్లి పోవడంతోనే మొదలు పెడుతుంటుంది. ఆ వారం కూడా అదే పద్ధతిగా ఆ పనిలోకి దిగింది.

రంగారావు గదిలో అన్ని వస్తువులూ తుడిచి సమంగా సర్దుతూ టేబిలు దగ్గరికి వెళ్లింది. దాని మీద నాలుగయిదు మేగజైన్లూ, డైరీ పేపరూ ఎందరవందరగా పడి వున్నాయ్. వాటిని క్రమంగా ఓ ప్రక్కకి సర్ది పెడదామని తీయ పోయే సరికి— ఏదో పుస్తకంలో నుంచి ఓ కాయితం క్రింద పడింది. యథాలాపంగా దానిని చేతిలోకి తీసుకుని చూసింది.

అది పనికి రాని ఒక చెత్తకాయితం. బాల్ పెన్ రీఫిల్ రాయడం మానేసినప్పుడు, దానిలో మళ్లీ యింక్ ఫ్లో తెప్పించడానికి పిచ్చి గీతలు గీసిన కాయితం! దానిని పదిలంగా మళ్లీ పుస్తకంలో దాచడం అనవసరమనుకొని, ఓసారి వెనక్కి తిప్పి చూసింది యథాలాపంగా.

ఆ వైపున కూడా అటువంటి గీతలే వున్నాయ్. ఆ గీతల్లో కొన్ని అక్షరాలు— వంటి కుర్రాడు అఆలు నేర్చుకోవడానికి దిద్దినట్టుగా—ముద్దగా వ్రాయబడి వున్నాయ్. వాటిని చదివిన శాంభవి గుండె ఝల్లుమంది. మరోసారి వాటిని చదవకుండా వుండలేక పోయింది.

"నేను వెధవని, నువ్వు వెధవని. ఉత్త వెధవని. నేను పెళ్లి చేసుకోవడమే పెద్ద తప్పు.." అని వ్రాసిన ఆ మాటల్ని అయిదా




రుసార్లు దిద్దినట్టుగా కనబడుతోంది...

ఆ పిచ్చిరాతకీ, యిటీవల అతని ప్రవర్తనలోవస్తున్న మార్పుకీ సంబంధం వుందా?

వుంది— చాలా వుంది! అతను తన నుంచి దూరంగా జరిగి పోతున్నాడు. తమ యిద్దరి మధ్యా పెద్ద అగాధం ఏర్పడుతున్న పరిస్థితి స్పష్టంగా కనబడుతోంది.

కళ్లల్లో నీళ్లు యిగిరి పోయాయ్. క్రమంగా వెక్కు తగ్గింది. మెల్లగా వెల్లకిలా తిరిగింది. మరోసారి ఆ కాయితంలోని వాక్యాలు చదివింది.

ఈ భావనా, ఈ సంఘర్షణా యింకా యిలాగే కొనసాగితే— అతను పిచ్చివాడయ్యే ప్రమాదముంది. ఆత్మహత్యకు పాల్పడినా ఆశ్చర్యం వుండదు! అప్పుడు తన గతేమిటి?

భయంతో నిలువునా వణికి పోయింది శాంభవి.

దీనంతటికీ తనే కారణం. తన తప్పేమిటో తనకి బాగా తెలును. అది దిద్దు కోలేక పోతుండడం తన అసహాయత కావచ్చు!కాని.. దానికి, అతను శిక్ష అనుభవిస్తున్నాడు! యిక ఉపేక్షించకూడదు. తనలో గూడుకట్టుకున్న అర్థం లేని భయాన్ని అధికమించి, అతని ఆవేదనని దూరం చేయక పోతే— తన జీవితమే అన్యాయమైపోవచ్చు

శాంభవి ఆలోచనలు గతాన్ని తవ్వుకొంటూ వెళ్లాయ్..

ఏడేళ్ల క్రిందట జరిగిన సంఘటన కళ్ళ ముందు మెదిలింది.

తానప్పుడు టెన్త్ క్లాస్ చదువుతోంది. వయసు తెస్తున్న సొంపులతో తన దేహం కొత్త వంపుల్ని సంతరించుకొంటూ తన అందానికి మెరుగులు దిద్దుతున్న రోజులవి. తమ వీధిలోనే వుండే కాంచనా తనూ కలిసి స్కూలుకి వెడుతుండేవారు. కాంచనా తన క్లాస్ మేట్ కూడా! ఆమె కాస్త ఛాయతక్కువైనా, అందంగానే వుండేది.

దగ్గరగా వుంటుంది గదా అని, ఒక మామిడి తోట ప్రక్క నుంచివున్న అడ్డదారిలో యిద్దరూ స్కూలుకి వెళ్లి వస్తుండేవారు. ఆ ఊరి ప్రెసిడెంటు తమ్ముడు సోమ రాజూ, ఓ మోతుబరి రైతు కొడుకు వెంకటరావూ తమ వెంట బడి ఏదొకటి అంటుండే వారు. ఆ యిద్దరూ ఆ ముందు సంవత్సరం అదే స్కూల్లో టెన్త్ చదివి ఫెయిలయ్యారు.

రోజు రోజుకీ వాళ్ల బెడద ఎక్కువయ్యే సరికి తనకి సహనం చచ్చిపోయింది. ఒక రోజు ఆ యిద్దరినీ చెడామడా తిట్టేసింది తను. దాంతో, మూడు రోజులు పత్తా లేరు వాళ్లు.

నాలుగో రోజు— ఎందుకనో స్కూలుకి రాలేదు కాంచన. సాయంత్రం తను ఒంటరిగా స్కూలు నుంచి వస్తుండగా, చెట్టు మీద నక్కిన ఆ యిద్దరూ ఒక్కసారి క్రిందికి దూకి, తన ముందుకొచ్చారు. తనకి భయం వేసి మాట పెగల్లేదు.

అదే అదనుగా, యిద్దరూ చెరో ప్రక్కా పట్టుకుని తనని ఆ మామిడి తోటలోకి లాక్కుని పోయారు. బాగా గుబురుగా, కొమ్మలు నేలకు ఆనుకుని వున్న ఓ జీడు మామిడి చెట్టు క్రిందకి తీసుకు పోయి— "మమ్మల్ని తిట్టినందుకు నీకిప్పుడు తగిన శాస్తి చేస్తాం" అంటూ తన మీద కలియబడ్డారు.

వెంకటరావు ఓణీ లాగేశాడు. సోమ రాజు జాకిట్టు విప్పేసే ప్రయత్నం చేస్తుండగా, తను ఎంతగానో ప్రాధేయ పడింది విడిచి పెట్టమని. ఏడుస్తూ దణ్ణం పెట్టింది.అయినా వాళ్లు వినిపించుకోలేదు. ఆ పెనుగులాటలో తను క్రిందపడి పోయింది.

సోమరాజు తలవైపునా, వెంకటరావు కాళ్ల వైపునా ఆక్రమించుకుని నానా భీభత్సంగా ప్రవర్తిస్తూ దాదాపుగా తనను వస్త్ర విహీనను చేసేశారు. కాళ్ల వైపున వున్న వెంకటావు తన మీదకి ఎగబడ్డాడు.

అదేటయిముకి— ఆ కమతంలో పని చేసే పాలేరు పెళ్లాం, కూనిరాగం తీసుకొంటూ పిడకలూ, ఎండు పుల్లలూ ఏరుకోవ

దానికొచ్చింది.

అది తన పాలిట శ్రీరామరక్ష అయింది.

వాళ్లిద్దరూ దానిని అంత దూరంలో చూస్తూనే భయపడి పోయి, తనని అలానే వదిలేసి గబగబా జారుకున్నారు.

తను ధైర్యం చిక్కబట్టుకుని లేచింది. వాళ్ల గోటి రక్కుల వల్ల తన దేహంలో అయిదారు చోట్ల రక్తం కూడా చిమ్మింది. మెల్లిగా బట్టలు కట్టుకుని, రేగిన జుత్తు సర్దుకుని, అక్కడక్కడా పడి వున్న పుస్తకాలు ఏరుకుని బయలుదేరింది.

అక్కడి నుంచి యింటికెలా వచ్చిందో తనకే తెలియదు. యింట్లో ఎవరికీ ఆ విషయం చెప్పలేదు. ఆ రాత్రికి విపరీతమైన జ్వరం వచ్చేసింది. అయిదారు రోజులు మంచం దిగలేదు.

ఆ జ్వర తీవ్రతలో ఏదేదో పలవరించేదట. భయంతో కేకలు వేసేదట. తన మీద జరిగిన అఘాయిత్యం గురించి యింట్లో వాళ్లకి తెలియదుగనుక, అది గాలి గుణమనుకుని తాయెత్తు కట్టించారు. మంత్రగాడిని రప్పించి ఏవేవో పూజలు చేయించారు.

జ్వరం తగ్గిన తరువాత మళ్ళీ స్కూలుకి వెళ్లడం ప్రారంభించింది తను. అయితే— మరెప్పుడూ ఆ అడ్డదారిన మాత్రం వెళ్లలేదు.

ఏళ్లు గడిచినా ఆ పీడకల తనని వదలలేదు. ఆనాటి ఆ సంఘటన తాలూకు భయాందోళనలు తన మనసులో నుంచి వైదొలగక పోవటం తన దురదృష్టం.

రంగారావుతో తనకి వివాహమైంది.

తొలిరాత్రి— అతను చేరువైనప్పుడు— తానెందుకో భయంతో వణికిపోయింది. ఆనాటి దారుణ సంఘటన గుర్తుకొచ్చింది. అతనిని దూరంగా నెట్టెయ్యాలనిపించింది. 'వదలండి' అని గట్టిగా అరవాలనిపించింది.

కాని— తన విచక్షణా జ్ఞానం ఆ పని చేయనివ్వలేదు. కళ్ళుమూసుకుని చలన రహితంగా వుండిపోయింది.

ఆ రోజునే అతను చాలా అసంతృప్తి ఫీలయ్యాడని తనకి తెలుసు. కాగా, తన చెక్కిలి నిమురుతూ "నేనేమయినా మొరటుగా ప్రవర్తించానా?" అని అదో బిడియంగా అడిగినప్పుడు— అదేం కాదనీ, తనకి వంట్లో బావుండలేదనీ అబద్ధమాడింది. లోపల మాత్రం ఆ




భయం తగ్గలేదు.

అప్పట్నుంచీ అదే అబద్ధాన్ని అలవాటు చేసుకొంది.

అతను దేవుడు. మంచికి మారు పేరు అనదగిన మనిషి అందగాడు కూడా! అటువంటి భర్త దొరకడం తన అదృష్టం!

భార్యగా, అన్ని విధులనూ సక్రమంగానే నిర్వహించగలుగుతోంది తను. కాని— ఆ ఒక్క విషయంలోనే అతనికి న్యాయం చెయ్యలేక పోతోంది. అతని చెయ్యి తన వంటి మీద పడేసరికి ఆనాటి ఆ దుర్మార్గపు సంఘటన కళ్ల ముందు మెదుల్తోంది. దాంతో, తనలో అదో భయం ఆవహిస్తోంది. వెంటనే, ఏదొక అబద్ధపు సాకు చెప్పి దూరంగా జరిగి పోతోంది తను.

అతని స్థానంలో మరింకెవరున్నా, తన ప్రవర్తనకి మరో విధంగా సందేహించి, తనని తిట్టీ కొట్టీ పుట్టింటికి పంపించెయ్యడం కూడా జరిగి వుండేదేమో!

రంగారావు ఆఫీసు నుంచి యింటికి చేరుకునే సరికి, పావు తక్కువ ఎనిమిదయింది. యింట్లో అడుగు పెడుతూనే భార్యను చూసి విస్మయంతో కనురెప్పలు రెపరెపలాడించాడు.

తెలుపు మీద నీలం, ఎరుపూ డాట్స్ వున్న విమల్ పాలిస్టర్ చీర కట్టి దాని మీద తెల్లటి షిఫాన్ జాకెట్టు వేసింది. చక్కగా అలంకరించుకుని జడలో రెండు మూరల మల్లెల దండ ముడుచుకొంది. ఆమెను అలా చూడగానే తన శోభనం రోజు గుర్తుకొచ్చింది అతనికి.

ఆమె ఆ విధంగా ఎప్పుడూ తయారవ్వదు. సాయంత్రం పూట ముఖానికి అసలు పౌడరే రాయదు. వివాహమైన కొత్తలో తను మల్లెపూవులు తెస్తుండేవాడు. పూవులు పెట్టుకోవడం తనకి యిష్టముండదని ఆ దండల్ని దేవుడి పటానికి వేస్తుండేది.

"ఏదయినా విశేషమా?" అడగ కుండా వుండలేక పోయాడు.

సుతారంగా నవ్వుతూ తల అడ్డంగా ఊపింది శాంభవి.

"ఏమయినా, యివ్వాళ చాలా అందంగా కన్పిస్తున్నావ్!" అని మనసులో మాట చెప్పి తన గదిలోకి వెళ్లి పోయాడు.

నిలువునా కితకితలు పెట్టినట్టు మెలికలు తిరిగి పోయింది శాంభవి. ఏలిన్నాటి శనిలా ఏడేళ్ల పాటు తనని పీక్కుని తినేసిన పీడకలని శాశ్వతంగా మరచి పోవాలన్న దృఢ సంకల్పంతో వుంది తను. ఉదయం, ఆ విత్తు కాయతం మీద రాత మూసిన తర్వాత—భర్త గురించి ఆమెలో చోటు చేసుకున్న భయం— అంత వరకూ ఆమెలో గూడుకట్టుకుని వున్న అర్థం లేని భయాన్ని ఆవలికి నెట్టేసింది.

భోజనం దగ్గర అతని చేత మాట్లాడించాలని చాలా ప్రయత్నం చేసింది తను. కాని, అతను అడిగిన దానికి ముటుకు క్లుప్తంగా సమాధానం చెప్పి వూరుకునే వాడు. అది కూడా— తలవంచుకుని అన్నంకలుపుతూనో, మరెటో చూస్తూనో చెప్పడమే గాని తన ముఖంలోకి చూడనేలేదు!

అన్నీ చక్కబాటు చేసుకుని కిచెన్‌లో లైటు తీసేసి అతని గదిలో అడుగు పెట్టేసరికి, టేబిలు దగ్గర కూర్చుని సిగరెట్ కాలుస్తూ ఏదో ఆలోచిస్తున్నాడు. అడుగులో అడుగేసుకొంటూ వెళ్లి, వెనకగా నిలబడి అతని భుజం మీద చెయ్యివేసింది.

ఉలిక్కి పడ్డాడు రంగారావు, తువ్వున లేచి నిలబడి సిగరెట్‌ను యాష్ ట్రేలో నొక్కుస్తూ "ఏమిటీ?!" విభ్రాంతిగా చూశాడు.

"నేను యిక్కడ— మీ మంచం మీద పడుకుంటాను.."

"అయితే— నన్ను ఆ గదిలోకి వెళ్ల మంటావా?"

ఏడుపొచ్చేసింది శాంభవికి. "ఊహూ— మీరెక్కడ పడుకుంటే నేనూ అక్కడే పడుకుంటాను. ఆఫ్టరాల్— అయ్యాం యువర్ వైఫ్!" అని ఏడుస్తూ అతనిని బల్లిలా కరుచుకుపోయింది.